GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్




సంపుటి : 6 | సంచిక : 39 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | మంగళవారం : సెప్టెంబర్-24-2024 | పేజీలు : 3

# దళితులపై దాడుల్లో...

## బిజెపి పాలిత రాష్ట్రాలే టాప్

- అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు
- చెబుతున్నప్రభుత్వ నివేదికలు

**టీ మీడియా ,సెప్టెంబర్ 23,న్యూఢిల్లీ :**



2014లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై దాడులు అధికమయ్యాయి. ప్రత్యేకించి బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులపై అఘాయిత్యాలు మరింత ఎక్కువయ్యాయి. మోడీ 3.0 ప్రభుత్వంలో మిత్రపక్ష పార్టీగా ఉన్న జెడియు అధికారం ఉన్న బీహార్‌లో తాజాగా 21 పైగా దళితుల ఇళ్లకు నిప్పు పెట్టిన ఉదంతం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో బిజెపి పాలిత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో 2022లో అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని తాజాగా విడుదల చేసిన ప్రభుత్వ నివేదికలే చెబుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో ఎస్సీలపై దాడులకు పాల్పడిన కేసులు దాదాపు 23 శాతం, రాజస్థాన్‌లో 16 శాతం, ఎస్టీలపై అఘాత్యాలకు పాల్పడిన కేసులు 30 శాతం మధ్యప్రదేశ్‌లో నమోదయ్యాయని నివేదిక తెలిపింది.2022లో ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) చట్టం కింద 51,656 కేసులు నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లో 12,287 (23.78 శాతం), రాజస్థాన్ 8,651 (16.75 శాతం), మధ్యప్రదేశ్ 7,732 (14.97 శాతం), బీహార్ 6,799 (13.16 శాతం), ఒడిశా 3,576 (6.93 శాతం), మహారాష్ట్ర 2,706 (5.24 శాతం) కేసులు నమోదయ్యాయి. ఈ ఆరు రాష్ట్రాల్లోనే ఎస్సీ చట్టం కింద 81 శాతం కేసులు నమోదవడం విశేషం. 2022లో భారతీయ శిక్షాస్మృతితో కలిపి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద దేశ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ చట్టం కింద 52,866 కేసులు నమోదైతే%ౕ% ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, హర్యానా, గుజరాత్, కేరళ వంటి 13 రాష్ట్రాల్లోనే దాదాపు 97.7 శాతం నమోదయ్యాయని ఈ నివేదిక తెలిపింది. ఈ 13 రాష్ట్రాల్లో ప్రత్యేకించి 2022లో ఎస్టీలపై 9,735 కేసులు నమోదయ్యాయి. వీటిల్లో 2,979 (30.61 శాతం) కేసులతో మధ్యప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. ఇక 2 ,498 (25.66 శాతం)లతో రాజస్థాన్ రెండోస్థానంలో ఉంది.



ఆ తర్వాతి స్థానాల్లో ఒడిశా 773 (7.94 శాతం), మహారాష్ట్ర 691 (7.10 శాతం), ఆంధ్రప్రదేశ్ 499 (5.13 శాతం) వున్నాయి.

ఈ కేసుల చార్జిషీట్లు, దర్యాప్తులకు సంబంధించిన వివరాలను కూడా ఈ నివేదిక వెల్లడించింది. ఎస్సీ సంబంధిత కేసుల్లో 60.38 శాతం ఛార్జిషీట్లు దాఖలు చేసినట్లు ఈ నివేదిక తెలిపింది. అయితే 14.78 కేసుల్లో తప్పుడు వాదనలు లేదా సాక్ష్యాధారాలు సరిగ్గా లేకపోవడం వంటి కారణాల వల్ల వాటిని క్లోజ్ చేయడం జరిగిందని ఈ నివేదిక వెల్లడించింది. 2022 చివరి నాటికి 17,166 కేసుల విచారణ పెండింగ్‌లో వున్నాయి. ఇక ఎస్టీ సంబంధిత కేసుల్లో 14.71 శాతం కేసులు విచారణ వంటివేమీ లేకుండానే క్లోజ్ అవగా, 2,702 కేసుల్లో విచారణ కొనసాగుతోంది. ఈ చట్టం కింద ఉన్న కేసులకు నేరారోపణ రేటు తగ్గిందని తాజా నివేదిక తెలిపింది. 2020లో నేరారోపణ రేటు 39.2 శాతం ఉంటే.. 2022లో 32.4 శాతానికి పడిపోయింది. ఈ చట్టం ప్రకారం కేసులను నిర్వహించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టులు సరిపోవడం లేదని తాజా నివేదిక ఎత్తిచూపింది. 14 రాష్ట్రాల్లో 498 జిల్లాల్లో 194 జిల్లాలు మాత్రమే కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేశాయి. కుల ఆధారిత హింసను అరికట్టడానికి, బలహీన వర్గాలకు రక్షణ కల్పించడానికి జిల్లా యంత్రాంగాల జోక్యం అవసరమని ఈ నివేదిక నొక్కి చెప్పింది. దళితులపై అఘాయిత్యాలు అరికట్టాలంటే కచ్చితంగా ప్రొటెక్షన్ సెల్స్ అవసరమని ఈ నివేదిక చెప్పింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, అస్సాం, బీహార్, చత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, జార?ండ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మేఘాలయ, మిజోరాం, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, తమిళనాడు, తెలంగాణ, త్రిపుర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్, అండమాన్ నికోబార్ దీవులు, చండీగఢ్, ఢిల్లీ, జమ్మూ అండ్ కాశ్మీర్, లడఖ్, పుదుచ్చేరిలు ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ సెల్స్ ఏర్పాటు చేశాయని నివేదిక తెలిపింది. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి వారి ఫిర్యాదులకు నమోదు చేసుకోవడానికి ప్రత్యేక పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు చేసిన రాష్ట్రాల్లో బీహార్, చత్తీస్‌గఢ్, జార?ండ్, కేరళ, మధ్యప్రదేశ్‌లు ఉన్నాయి.




## అక్టోబర్ నుంచి సన్నబియ్యం

- మంత్రి ఉత్తంకుమార్రెడ్డి

**టి మీడియా,సెప్టెంబర్ 23, హైదరాబాద్ బ్యూరో :**



అక్టోబర్ నెల నుంచి రేషన్ కార్డుదారులందరికీ సన్న బియ్యాన్ని ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని పౌరసరఫరాలు, సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కొత్తగా డిజిటల్ కార్డులు జారీ చేస్తున్నామని, ఈ కార్డు ద్వారా ఎక్కడైనా ఎప్పుడైనా బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు తీసుకునే అవకాశం ఉందని, ఈ కార్డు ద్వారా పింఛన్ కూడా పొందవచ్చని పేర్కొన్నారు.తెలంగాణకు చెందిన ఎంతోమంది. మేస్త్రీలు, ఇతర కూలీలు జీవనోపాధి కోసం ముంబై, ఇతర ప్రాంతాలకు వెళతారని, తిరిగి వారి స్వగ్రామానికి వచ్చి పింఛన్, రేషన్ తీసుకునేందుకు అవకాశం ఉండదని, అలాంటి వారు ఎక్కడినుంచైనా ఇవి పొందే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని, ఇందుకు అవసరమైన నిధులను కేటాయిస్తామని ఉత్తమ్ చెప్పారు.ఇప్పటికే శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం పనులు పూర్తి చేసేందుకు 4వేల కోట్లకు పైగా నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని, పాలమూరు రంగారెడ్డితోపాటు ఇతర ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన చెప్పారు.

## వంతెన కింద పడిన బస్సు

### నలుగురు మృతి, 30 మందికి గాయాలు

**టీ మీడియా ,సెప్టెంబర్ 23,అమరావతి (మహారాష్ట్ర) :**



మహారాష్ట్ర అమరావతిలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. సోమవారం ఉదయం పరట్వాడి ధానీ రూట్‌లో సెమడో%ఎ% సమీపంలో మెల్‌ఘాట్‌లోని మలుపులు తిరుగుతున్న సమయంలో ఓ ప్రైవేటు బస్సు అదుపుతప్పి వంతెన కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణీకులు మృతి చెందారు. 30 మందికి గాయాలయ్యాయని కలెక్టర్ సౌరభ్ కతియార్ తెలిపారు. వీరిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని వారిని సెమడో%ఎ% సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందిస్తున్నట్లు సౌరభ్ చెప్పారు.



## కర్నూలులో హైకోర్టు బెంచ్..

- అమరావతిలో అంతర్జాతీయ 'లా' కళాశాల..
- ఏపీ సీఎం చంద్రబాబు

**టీ మీడియా, సెప్టెంబర్ 23,అమరావతి:**

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సోమవారం ఆయన న్యాయశాఖపై సమీక్ష నిర్వహించారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రతిపాదనలను త్వరలోనే కేంద్రానికి పంపనున్నట్లు స్పష్టం చేశారు. మంత్రివర్గ భేటీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామన్నారు. అమరావతిలో అంతర్జాతీయ న్యాయ కళాశాల ఏర్పాటుపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్టు ద్వారా 100 ఎకరాల్లో న్యాయకళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేల గౌరవ వేతనం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. జూనియర్ న్యాయవాదులకు శిక్షణ అకాడమీ ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు.


**ఇమామ్ లకు గౌరవ వేతనం పెంపు**

అంతకుముందు మైనారిటీ సంక్షేమ శాఖపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. మైనార్టీ సంక్షేమ పథకాల పునర్వ్యవస్థీకరణపై చర్చించారు. కడప హజ్ హౌస్, గుంటూరు క్రిస్టియన్‌భవన్‌ను పూర్తి చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. నూర్ బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇమామ్‌లకు రూ. 10 వేలు, మౌజన్‌లకు రూ. 5 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని నిర్ణయించారు. మైనార్టీలకు లబ్ధి జరిగేలా వక్ఫ్ భూములను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు.

## కాంగ్రెస్.. దళిత వ్యతిరేక పార్టీ

- కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా

**టీ మీడియా ,సెప్టెంబర్ 23,ఫతేహాబాద్ (హర్యానా) :**



దేశంలో ప్రధాన ప్రతిపక్షపార్టీ కాంగ్రెస్ దళిత వ్యతిరేక పార్టీ అని కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా దుయ్యబట్టారు. అక్టోబర్ 5న జరగనున్న హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా%ౕ% అమిత్ షా సోమవారం హర్యానాలోని ఫతేహాబాద్‌లో జరిగిన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీలో ప్రసంగించిన ఆయన కాంగ్రెస్‌ని తీవ్రంగా

మిగతా 3లో..

## జగన్ మెడకు లడ్డూ కల్తీ వ్యవహారం

- హైదరాబాద్ లో వైసీపీ అధినేతపై కేసు

**టి మీడియా,సెప్టెంబర్ 23,హైదరాబాద్ బ్యూరో :**

లడ్డూ తయారీలో జరిగిన అవకతవకలపై ఏపీ మాజీ సీఎం, వైసీపీ నేత జగన్ పై హైదరాబాద్ లో కేసు నమోదు అయ్యింది. హైకోర్టు న్యాయవాది కే. కరుణ్ సాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో ఉపయోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు వినియోగించినట్లు ల్యాబ్ టెస్ట్ రిపోర్టులలో నిర్ధారణ అయిన విషయం తెలిసిందే. దీనిపై కలత చెందిన కరుణ్ సాగర్ మాజీ సీఎం జగన్ పై సైదాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అలాగే గత ప్రభుత్వ హయాంలోని టీటీడీ చైర్మన్ సహా పాలక మండలి సభ్యుల పేర్లను కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఆయన మాట్లాడుతూ.. తిరుమలలో శ్రీవారి ప్రసాదంగా అందించే లడ్డూ దైవత్వానికి ప్రతీక అని, ఇది ఒక విధంగా హిందువుల మనోభావాలు దెబ్బతీసినట్టేనని తెలిపారు. అలాగే పవిత్రతో పాటు నాణ్యతలో శ్రీవారి లడ్డూ ప్రసిద్ధి పొందిందని, లడ్డూను తాను అత్యంత గౌరవిస్తానని, ఈ చర్య గత ప్రభుత్వ కుట్రలో భాగమేనని కరుణ్ సాగర్ ఆరోపించారు. ఇక తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం వైసీపీ అధినేత జగన్ మెడకు చుట్టుకుంటుంది. గత ప్రభుత్వ హాయాంలోనే తిరుమల ప్రసాదం లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యి సరఫరా చేసేందుకు టెండర్లు పిలిచి కాంట్రాక్టు ఇచ్చారు. దీంతో ఈ అంశంలో జగన్ పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రసాదం తయారీలో కూడా అవినీతికి పాల్పడటమేంటని అధికార పక్ష నేతలు మండిపడుతుండగా.. మరోవైపు కలియుగ దైవంగా కొలిచే శ్రీవారిని అప్రతిష్టపాలు చేశారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ అంశంపై ఇప్పటికే సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు కాగా.. ఇప్పుడు ఏకంగా జగన్ పైనే కేసు నమోదు కావడం ఆయన్ను చిక్కుల్లో పడేసినట్టు అయ్యింది. ఈ వ్యవహారంలో ఎవరెవరి ప్రమేయం ఉందో వారిని అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీలోని కూటమి ప్రభుత్వం ప్రకటించింది.



## ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా పని చేస్తా

- ఢిల్లీ సీఎం అతీషి

**టి మీడియా,సెప్టెంబర్ 23,న్యూ ఢిల్లీ :**



ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఇటీవలే ప్రమాణ స్వీకారం చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు అతిశీ సోమవారం ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ బాధ్యతలు చేపట్టిన అత్యంత పిన్న వయస్కు రాలిగా ఆమె నిలిచారు. ఈ సందర్భంగా ఆమె రామాయణంలో రాముడి కోసం భరతుడు చేసినట్లు తాను ఆపద్ధర్మ ముఖ్య మంత్రిగా పనిచేస్తానని వ్యాఖ్యానించారు. తన పక్కన ఓ ఖాళీ కుర్చీని ఉంచారు. ఆ కుర్చీలో సీఎంగా కేజ్రీవాల్మళ్లీకూర్చుకుంటారన్న సంకేతాలు ఇచ్చారు. రామాయణంలో రాముడి పాదరక్షలు సింహాసనంపై ఉంచి భరతుడు రాజ్యాన్ని 14 ఏళ్ల పాటు పాలించిన విషయం తెలిసిందే. ఓ కుర్చీని అతిశీ చూపిస్తూ ఇది ముఖ్యమంత్రి సీటని, కేజ్రీవాల్ మళ్లీ సీఎం అయ్యే వరకు ఇది ఖాళీగా ఉంటుందని అన్నారు. దీంతో ఆమెపై బీజేపీ తీవ్ర విమర్శలు చేస్తోంది. కేజ్రీవాల్ రిమోట్ కంట్రోల్ ప్రభుత్వాన్ని నడుపుతారా?అని ప్రశ్నించింది. కుర్చీలో ఆమెను కూర్చోబెట్టి మిగతా వ్యవహారాలంతా కేజ్రీవాలే చూసుకుంటారని విమర్శించింది. కాగా, ఇటీవలే నిరాడం బరంగా రాజ్ భవన్ లో ఢిల్లీ ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణస్వీకారం జరిగింది. ఢిల్లీ ముఖ్య మంత్రిగా అతిశీతో ప్రమాణ స్వీకారం చేయించారు ఎల్జీ వినయ్ కుమార్ సక్సేనా. ఢిల్లీ 8వ ముఖ్యమంత్రిగా అతిశీ నిలిచారు. మంత్రులుగా సౌరభ్ భరద్వాజ్, కైలాశ్ గెహ్లాట్, గోపాల్ రాయ్, ఇమ్రాన్ హుస్సేన్, ముకేశ్ అహ్లావత్ ప్రమాణ స్వీకారం చేశారు. సెప్టెంబర్ 26-27 తేదీల్లో ఢిల్లీ అసెంబ్లీలో అతిశీ బలనిరూపణ చేసుకోను న్నారు.

## దిసనాయకేకి శుభాకాంక్షలు తెలిపిన మోడీ, ఖర్గే

**టీ మీడియా ,సెప్టెంబర్ 23,న్యూఢిల్లీ :**



తాజాగా జరిగిన శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష నేత అనుర కుమార దిస్సనాయకే ఎన్నికయ్యారు. ఆ దేశానికి వామపక్షనేత అధ్యక్షుడు కావడం ఇదే తొలిసారి. దీంతో ఆయనకు దేశ విదేశాల నుంచి శుభాకాక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత ప్రధాని, ప్రధాన పత్రిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలు దిస్సనాయకేకి ఎక్స్ వేదికగా సోమవారం అభినందనలు తెలిపారు. కాగా, 'శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించినందుకు మీకు నా ప్రత్యేక అభినందనలు. భారత్ పొరుగు దేశమైన శ్రీలంక ఫస్ట్ పాలసీ అండ్ విజన్ సాగర్ (సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఫర్ ఆల్ ఇన్ ద రీజియన్.. ప్రాంతంలోని అందరికీ భద్రత మరియు వృద్ధి)కు ప్రత్యేక స్థానం ఉంది. మన ప్రజలు, మొత్తం ప్రాంత ప్రయోజనాల కోసం మన బహుముఖ సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి, మీతో కలిసి పనిచేయడానికి నేను ఎదురుచూస్తున్నాను' అని మోడీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'డెమోక్రటిక్ సోషలిస్ట్ రిపబ్లిక్ ఆఫ్ శ్రీలంక ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైనందుకు అనుర కుమార దిస్సనాయకెకి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున నా హృదయక పూర్వక అభినందనలు. శ్రీలంక, భారత్ దేశాల మధ్య ఉన్న బహుముఖ సహకారం, పరస్పర చర్యలు గొప్ప వారసత్వాన్ని కలిగి ఉన్నాయి. ఇది శతాబ్దాల నాటిది. భారత దేశ ప్రజలు మన ప్రాంత ప్రయోజనాల కోసం, మన సంబంధాలను, భాగస్వామ్య విలువలను బలోపేతం చేయడానికి ఎదురుచూస్తున్నారు' అని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

# క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ప్రారంభమైన ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడోత్సవాలు..



**టీ మీడియా, సెప్టెంబర్ 23,పటాన్చెరు :**
డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన 68వ స్కూల్స్ గేమ్ ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లా స్థాయి క్రీడోత్సవాలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..విద్యార్థి దశ నుండే క్రీడలపై ఆసక్తి పెంపొందించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని కోరారు. క్రీడల ద్వారా శారీరకదారుఢ్యం, మానసిక ఉల్లాసంతో పాటు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంలో ఉపయోగపడతాయని తెలిపారు. క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని టాన్ చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.పటాన్చెరు నియోజకవర్గంలో ఏడాది పొడవునా వివిధ అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో,యువకుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, మండల విద్యాధికారి పిపి రాథోడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, మైత్రి క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ సిబ్బందికి అందని జీతాలు


- ఎనిమిది నెలలుగా ఎదురుచూపులు



**టీ మీడియా, సెప్టెంబర్ 23, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రంలో ఉన్న మున్సిపాలిటీ యందు పనిచేసిన సిబ్బందికి గత ఎనిమిది నెలలుగా వేతనాలు ఇవ్వకుండా విధులు నిర్వహిస్తున్న కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్న పట్టణ మున్సిపల్ కమిషనర్ , శానిటేషన్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి పైపై తగు చర్యలు తీసుకొని వెంటనే జీతాలు ఇచ్చే విధంగా తగు న్యాయం చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ కుప్రజావాణిలో సోమవారం వినతి ఇచ్చారు. వేతనాలు ఇవ్వాలంటే ప్రతి ఒక్క కార్మికుడు పదివేల రూపాయలు ఇవ్వాలని లేనిపక్షంలో ఉద్యోగం నుంచి తొలగిస్తామని భయపెట్టడం వల్ల విధి లేని పరిస్థితులలో డబ్బులుఇచ్చామన్నారు. కార్యక్రమంలో మానవహక్కుల ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ టి. శ్యామ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు , సి. విశ్వం బాబు ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షులు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. టీ మీడియా బ్యూరో గంధం రవికుమార్ మున్సిపల్ కార్మికులను సంప్రదిస్తే కొత్తగా తీసుకున్న మాకు 8 నెలలుగా జీతాలు ఇవ్వకుండా మమ్మల్ని వేధిస్తున్నారు. కాలి కడుపుతో పనిచేసే ఇంటికి వెళ్తున్నాం. పెళ్ళాం, పిల్లల్ని పోషించుకోవడానికి ఈ పని మాకు భారంగా అనిపిస్తుంది. ఎన్నో బాధలు భరిస్తూ ఉద్యోగం చేస్తున్న కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఇంతవరకు మాకు జీతాలు లేవు. వార్డులలో పని కోసం అని మమ్మల్ని తీసుకొని కొందరిని ఆఫీస్ కార్యాలయంలో, ట్రాక్టర్ డ్రైవర్లుగా, వైకుంఠరథం డ్రైవర్లుగా, పెట్టుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఉన్న సిబ్బంది కంటే ఎక్కువగా ఉండడం వలన ఉన్న ఆరు నుంచి పదిమందిపై వార్డులలో మురికి కాలువలు తీయడానికి పెడితే పని భారంతో ఎన్నో ఇబ్బందులు పడుతూ పని చేస్తున్న తినడానికి తిండి లేని పరిస్థితి మాకు ఏర్పడింది. అప్పులు తెచ్చుకొని మిత్తి కట్టలేని పరిస్థితిలో మా జీవితాలు వెలదీస్తున్నం అని మున్సిపల్ కార్మికుల తమ ఆవేదన వ్యక్తంచేసారు.

## ఏపీ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.25 లక్షల విరాళం

- మునుముందు మరింత సహకారం అందిస్తా • పంచాక్షరయ్య



**టి మీడియా,సెప్టెంబర్ 23, అమరావతి :**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 25 లక్షలు విరాళం అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని ఆయన కార్యాలయంలో కలిసి 25 లక్షలు చెక్కును అందించారు. ఇటీవల భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళం అందించినట్లు తాళ్లూరి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు తాళ్లూరి పంచాక్షరయ్య తెలిపారు. మునుముందు మరింత సహకారం అందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్ వల్లూరుపల్లి వంశీకృష్ణ, బూర్గంపాడు సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, తూము రామిరెడ్డి పాల్గొన్నారు. వరద బాధితుల కోసం సహాయం అందించిన ట్రస్ట్ బాధ్యులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు.

## ప్రజా అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**టీ మీడియా, సెప్టెంబర్ 23, మహానంది:**
ప్రజా అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రగతి సాధించి ప్రజా మన్ననలు పొందడం జరిగిందని టిడిపి నాయకురాలు గంగవరపు శశికళ కొండారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, శ్రీశైలం దేవస్థానం మాజీ ధర్మకర్త రవి స్వామి, పేర్కొన్నారు. సోమవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ద్వారా, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను, టిడిపి నాయకులు అధికారులతో కలసి ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వంద రోజుల్లోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా రంజక పాలన సాగించిన, విషయాన్ని ప్రజలంతా హర్షధ్వానాలతో స్వాగతిస్తున్నారన్నారు.ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పవన్, బిజెపి నాయకులు నాగేశ్వరరావు,పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఇర్ఫాన్, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, టిడిపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నాగరాల గ్రామంలో విషాదం

- యాక్సిడెంట్ లో తల్లి కూతురు మృతి



**టీ మీడియా, సెప్టెంబర్ 23, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలం నాగరాల గ్రామంంలో సోమవారం విషాద ఛాయలు అలుముకున్నాయి. నాగరాల మొదటి సెంటర్ ఎస్సీ కాలనీవాసులు వాసులు తల్లి గంధం స్వాతి కూతురు గంధం అశ్విత శ్రీరంగాపురం మండలానికి హాస్పిటల్ కి వెళ్తూ ప్రమాదవశాత్తు నాగరాల గ్రామానికి చెందిన గంధం పులేందర్ గందం స్వాతి అశ్విత తల్లి కూతురు ఇద్దరు శ్రీరంగాపూర్ హాస్పిటల్ వెళుతుండగా కాంక్రీట్ మిల్లర్ తాకి యాక్సిడెంట్ జరిగింది తల్లి కూతుళ్లు చనిపోయారు. భర్త గంధం పులేందర్ కు గాయాలయ్యాయి. ఇంత చిన్న వయసులో తల్లి కూతుర్లు మరణించడం చాలా దురదృష్టకరమైన సంఘటన అని గ్రామ ప్రజలు విషాదంలో మునిగిపోయారు.

## రైతులను ఇబ్బంది పెడుతున్నఏపీజివిబీ

- నిర్లక్ష్యం నీడలో సేవలు





**టీ మీడియా, సెప్టెంబర్ 23, వనపర్తి బ్యూరో :**
పెద్దమందడి మండల కేంద్రంలో ఉన్నటువంటి ఏపీజివిబీ లో ఇబ్బందులకు గురి చేస్తున్న బ్యాంక్ అధికారులు.సక్రమంగా సేవలు అందించలేక నానా అవస్థలు పడుతున్నారు.గంటల తరబడి క్యూ లైన్ లో ఉన్నప్పటికీ క్యాషియర్ దగ్గరికి డబ్బుల కు వెళ్లేసరికి సంతకాలు లేదనడం, ఆధార్ అప్డేట్, పలు రకాల సమధనాలు చెప్తూ మేనేజర్ దగ్గరికి వెళ్లి సంతకం పెట్టాలని ఫోటోలు తీసుకురావాలని జిరాక్స్ లు కావాలని వివిధ కారణాలతో చెప్పడం వల్ల రైతులు లబోదిబోమంటున్నారు.వివిధ రకాల ఇన్సూరెన్స్ లు అక్కడే చేపించుకుంటూ వివిధ రకాల డాక్యుమెంట్స్ తీసుకురావాలని వాపస్ పంపించడం జరుగుతుంది.అందువలన ఖాతాదారులకు తక్కువ సేవలు అందించడం జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. సమస్యలు చెప్పినప్పుడు సరైన సమాధానాలు లేకపోవడం ఖాతాదారులు వృద్ధులు, వికలాంగులు, రైతులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు బ్యాంక్ సిబ్బందిపై పలువురు విమర్శలు చేస్తున్నారు.

## జాతీయ అవార్డుకు ఎంపికైన మద్దెల దినేష్



**టీ మీడియా,సెప్టెంబర్ 23,గోదావరిఖని :**
గోదావరిఖని పట్టణంలో ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గా మద్దెల దినేష్ కు బెస్ట్ సర్వీస్ ఫర్ సొసైటీ జాతీయ అవార్డుకు ఎంపికయ్యాడు.బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో వచ్చే నెల 6 తేదీన తిరుపతిలో జరిగే కార్యక్రమంలో అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా,ఈ అవార్డు అందుకోనున్నారు.గత కొంతకాలం నుంచి ప్రజా ఉద్యమాలలో నేరుగా పాల్గొంటూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కృషి చేస్తున్నారు.ఈ విషయంలో మద్దెల దినేష్ ను,అందరూ అభినందిస్తున్నారు.ఈయన పోరాట స్ఫూర్తి ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నారు.

## పిచ్చి మొక్కలు తొలగింపు




**టీ మీడియా, సెప్టెంబర్ 23, వనపర్తి బ్యూరో :**
మై భారత్ ఆధ్వర్యంలో స్వచ్చత హి సేవా 2024 లో భాగంగా వనపర్తి జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలుర ఆవరణలో నిస్వార్థ ఆర్గనైజేషన్ సభ్యులు చెత్తను. పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేయడం జరిగింది. ఈ సంధర్భంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా మీ యొక్క పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో నిస్వార్థ ఆర్గనైజేషన్ సభ్యులు అరవింద్, శరత్, ప్రేమ్, కార్తీక్, కళ్యాణ్, మహేష్, అభినయ్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహానంది ఈఓగా శోభారాణి



**టీ మీడియా, సెప్టెంబర్ 23, మహానంది:**
మహానంది దేవస్థానం నూతన ఈఓ గా కె.శోభారాణిని నియమిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయ శాఖలో సాధారణ బదిలీల్లో భాగంగా మహానంది దేవస్థానానికి డిప్యూటీ కమిషన్ హోదాలో ఆమెను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. మహానంది దేవస్థానంలో ఇన్చార్జి ఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న నల్లకాల శ్రీనివాస్ రెడ్డిని బదిలీలో భాగంగా, పల్నాడు జిల్లా అమరేశ్వర స్వామి దేవస్థానానికి బదిలీ కావడం జరిగింది. అదేవిధంగా మహానంది దేవస్థానంలో ఏఈఓ గా విధులు నిర్వహిస్తున్న ఓ. వెంకటేశ్వర్లు అనంతపురం జిల్లా కసాపురం క్షేత్రానికి, అలాగే మహానంది ఆలయంలో విధులు నిర్వహించే ఎస్ .హరినాథ్, జూనియర్ అసిస్టెంట్ శ్రీశైలం దేవస్థానం నకు బదిలీ కావడం జరిగింది. శ్రీశైలం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులు మహానంది ఆలయానికి బదిలీ కావడం జరిగింది. వీరిలో మహానంది ఆలయానికి ఏ.ఈ.ఓ. గా ఎం. హరిదాస్, సూపర్డెంట్ గా పి .దేవిక, సీనియర్ అసిస్టెంట్ లుగా కే. జగదీశ్వర్ రెడ్డి, పి .సుబ్బారెడ్డి లు, జూనియర్ అసిస్టెంట్లు గా వి. వెంకటలక్ష్మి, కే. అనురాధ, ఎస్. లోకేశ్వరప్ప లు రావడం జరిగింది.

## టీ మీడియా కథనానికి స్పందన

- మెట్లు తొలిగించిన అధికారులు




టి-మీడియా

**టీ మీడియా, సెప్టెంబర్ 23, వనపర్తి బ్యూరో:**
వనపర్తి జిల్లా కేంద్రంలోని పాత కలెక్టర్ కార్యాలయం ముందు నిర్మించిన భవనానికి రోడ్డుపైన మెట్లు వేయడంతో మున్సిపల్ అధికారులు జెసిపితో వాటిని కులగొట్టడం జరిగింది. తిరిగి మళ్ళీ అలాగే కట్టడంతో మున్సిపల్ అధికారులు జెసిబి తో కులగొట్టారు. రోడ్డుపైనే నెలలు తరబడి అలాగే మట్టిని రాళ్లను పెట్టడంతో ప్రజలకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీన్ని గమనించిన టీ మీడియా ప్రతినిధి మున్సిపల్ అధికారులు రోడ్డుపై ఉన్న రాళ్ళను తొలగించాలని ప్రచురించిన కథనానికి స్పందించి మున్సిపల్ కమిషనర్ సోమవారం జెసిబి సహాయంతో మట్టిని రాళ్ళను తొలగించారు. దీనితో ఆ దారిలో తిరిగే ప్రజలకు, చిన్నపిల్లలకు రాకపోకలకు ఇబ్బంది తొలగిపోయింది. రాళ్లను తొలగించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు




**టీ మీడియా, సెప్టెంబర్ 23, గోదావరిఖని ప్రతినిధి :**
రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ జన్మదిన వేడుకలు గ్రామంలో, నియోజకవర్గంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కేటీఆర్ స్ఫూర్తితో గిఫ్ట్ ఇస్ మై లో భాగంగా తన జన్మదినం సందర్భంగా పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే చందర్ పిలుపుమేరకు రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో టిఆర్ఎస్ శ్రేణులు కోరుకంటి అభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఫైవ్ ఇంక్లైన్ టిఆర్ఎస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షులు బొడ్డు రవీందర్ ఆధ్వర్యంలో అమ్మ పరివార్ ఆశ్రమంలో అన్నదానం కార్యక్రమం చేపట్టారు. తిలక్ నగర్ టిఆర్ఎస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అంగన్వాడి కు తాటి కంటే తిరుపతి, మహేందర్ రెడ్డిలు కూలర్ ను అందించారు. టిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు ముద్దసాని సంధ్యారెడ్డి ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు పండ్లను, బ్రెడ్ ను పంపిణీ చేశారు. టిఆర్ఎస్ పార్టీ లక్ష్మీనారాయణ పట్టణ అధ్యక్షులు తిరుపతి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. గోదావరిఖని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు లతా దామోదర్, పాముకుంట్ల భాస్కర్, రాజు, మారుతి, సతీష్,రామమూర్తి, రవి, శ్రీనివాస్,రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రమేష్, శ్రీనివాస్, తిమోతి, రాజశేఖర్, శ్రావణ్, ఓదేలు, నాగరాజు, జడ్సన్, రామరాజు, ప్రసాద్,కనకయ్య, మహేందర్, నరసింహారెడ్డి, శ్రీకాంత్ గౌడ్, పద్మ, స్వప్న,తదితరులు పాల్గొన్నారు.

## అమీన్పూర్ లో అక్రమ నిర్మాణాలు కూల్చివేతలు “



**టీ మీడియా, సెప్టెంబర్ 23 ,పటాన్చెరువు :**
నియోజకవర్గం లోని అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని హైడ్రా దూకుడు పెంచింది. అమీన్ పూర్ మున్సిపాలిటీ కిష్టారెడ్డిపేట, పటేల్ గూడలో కూల్చివేసినట్లు చెప్పారు. పలు కట్టడాలను కూల్చివేశారు.ఈ సందర్భంగా కూల్చివేతలపై హైడ్రా అధికారులు కీలక వ్యాఖ్యలు చేశారు.కిష్టారెడ్డిపేట్ సర్వేనెంబర్ 164, పటేల్ గూడా 12 సర్వే నెంబర్ అక్రమా నిర్మాణాలను తొలగించిన హైడ్రా..అమీన్పూర్ ప్రాంతాల్లో అక్రమ కట్టడాలను నేలమట్టం చేసినట్లు వెల్లడించారు. కిష్టారెడ్డిపేట, పటేల్ గూడలో ఒకటి రెండు చోట్ల 6,7 బహుళ అంతస్తులను కూల్చివేసినట్లు చెప్పారు. అక్రమ వెంచర్లో 32 విల్లాలను కూల్చివేసినట్లు తెలిపారు.ప్రభుత్వ భూమిని ఆక్రమించి వాణిజ్య కార్యకలాపాల కోసం బిల్డర్ నిర్మించిన నిర్మాణాలను కూల్చివేశామని అన్నారు. కిష్టారెడ్డిపేటలో ఒక ఎకరా, పటేల్ గూడాలో మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.పేదల పట్ల హైడ్రా కర్కశంగా వ్యవహరిస్తోందంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెద్దలకు నోటీసులు ఇచ్చి టైం ఇస్తున్న హైడ్రా అధికారులు పేదల పట్ల మాత్రం కనికరం లేకుండా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న తమకు కనీసం టైం ఇవ్వకుండా ఆస్తితో పాటు అందులో ఉన్న వస్తువులను సైతం నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మా నిర్మాణాలు కూల్చేముందు మమ్మల్ని చంపేయండి’ అంటూ కొందరు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విలువైన సామాన్లు కూడా బయటకు తీసుకోకుండా.. ఏ మాత్రం సమయం ఇవ్వకుండా కూల్చివేతలు చేస్తున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు.

## గిన్నిస్ బుక్‌లో అయినముక్కల వాసికి స్థానం



**టీ మీడియా, సెప్టెంబర్ 23, పెద్దదోర్నాల:**
పెద్ద దోర్నాల మండలం ఆయన ముక్కల గ్రామానికి చెందిన తనుజ, విశాఖపట్నంలో జరిగిన స్వెటర్ల తయారీ లో ఉలన్ తో స్క్వేర్ లు చేయటం లో పాల్గొని అతి తక్కువ సమయంలో 58112 స్క్వేర్స్ చేసి “మహిళా మనోవికాస్” అనే సంఘం కొత్త గిన్నిస్ రికార్డు సృష్టించారు. ఇందులో మన పెద్దదోర్నాల మండలం, లోని ఐన ముక్కల వాస్తవ్యులు ఉండటం మన గర్వకారణం. మూల వెంకటేశ్వర రెడ్డి సతీమణి శ్రీమతి తనూజ వరుసగా ఇది మూడవ సారి రికార్డు సాధించగా, మూల రుత్విక్ రెడ్డి (11ఇయర్స్ ), మూల రిషికేశ్వర్ రెడ్డి (7ఇయర్స్ ) కూడా ఈ సారి గిన్నిస్ బుక్ లో స్థానం సాధించారు. టీవీ లు, సెల్ ఫోన్ ల కు అలవాటు పడిపోకుండా ఇంత చిన్న వయసులో ఈ రికార్డు సాధించడం అభినందనీయం. గ్రూప్ సభ్యులు 458 మంది లో రిషి అతి చిన్న వయస్సు కలవాడిగా ప్రత్యేక గుర్తింపు సాధించాడు.

## నేటి నుంచిపొలం పిలుస్తుంది కార్యక్రమం



**టీ మీడియా, సెప్టెంబర్ 23, పెద్దదోర్నాల:**
పెద్ద,దోర్నాల మండలం లో నేటి నుండి ప్రతి మంగళవారం , బుధవారం రోజు రెండు గ్రామాల చొప్పున పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అని మండల వ్యవసాయ అధికారి. డి. జవహర్ లాల్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులు గ్రామం లోని పంటలను సందర్శించి, రైతులకు పంటల పై అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. నేడు.జరగబోవు గ్రామాలు ఉదయం :చిన్నదోర్నాల మధ్యాహ్నం :జమ్మిదోర్నాల. జరుగుతున్నట్టు ఆయన తెలిపారు.

## డంపింగ్ యార్డ్ పనులను నిలిపివేయాలి

- ఎమ్మెల్యేకు వినతి పత్రం



**టీ మీడియా, సెప్టెంబర్ 23, గుమ్మడిదల :**
మండలం నల్లవల్లి గ్రామ పరిధిలోని ప్యారా నగర్ లో ఏర్పాటు చేయనున్న గ్రేటర్ హైదరాబాద్ జిహెచ్ఎంసి డంపింగ్ యార్డును తక్షణమే నిలిపివేయాలని కోరుతూ సోమవారం గుమ్మడిదల మండల నాయకులు స్థానిక శాసనసభ్యులు గుడెం మహిపాల్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అడవి ప్రాంతం పచ్చటి వాతావరణంతో కూడిన గుమ్మడిదల మండలంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం కారణంగా పూర్తిగా కలుషితంగా మారుతుందని అన్నారు. తద్వారా రైతులు నష్టపోవడమే కాక మండల ప్రజలు సైతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని వాపోయారు. రైతులను మండల ప్రజలను దృష్టిలో ఉంచుకొని ఈ డంపింగ్ యార్డ్ ఇక్కడ ఏర్పాటు చేయకుండా తక్షణమే పనులను నిలిపివేయాలని ఎమ్మెల్యే జిఎంఆర్ ను కోరుతూ వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పాలకవర్గం స్పందించి డంపింగ్ యార్డ్ ఇక్కడ ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి,ఎంపిటిసి ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ హనుమంత్ రెడ్డినాయకులు దేవేందర్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, చెన్నం శెట్టి సూర్యనారాయణ, బుచ్చ చంద్రారెడ్డి, రవీందర్ రెడ్డి, నల్తూరి యాదగిరి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అవార్డ్ గ్రహీతను సన్మానించిన ఉపాధ్యాయుల బృందం




**టీ మీడియా, సెప్టెంబర్ 23, వనపర్తి బ్యూరో :**
రాష్ట్ర ఉత్తమ గెజిటెడ్ హెడ్మాస్టర్ అవార్డ్ గ్రహీత పలుస శంకర్ గౌడ్ దంపతులను ను దగడపల్లి కాంప్లెక్స్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్ , ఉపాధ్యాయులు దగడపల్లి హైస్కూల్ తెలుగు కాంప్లెక్స్ సమావేశములో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కాంప్లెక్స్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్ మాట్లాడుతూ గత ముప్పై అయిదు సంవత్సరాలుగా విద్యాశాఖకు శంకర్ గౌడ్ చక్కటి సేవలందించడమేగాక సమాజ సేవలోనూ ముందుంటున్నారని కొనియాడారు.పాఠశాల అభివృద్ధి ,బాల్య వివాహాలు,అక్షర దీక్ష, విలవల కార్యక్రమం లాంటి విద్యాశాఖకు సేవా కార్యక్రమాలను నిర్వహిచారు అన్నారు.ఈనాటి ఉపాధ్యాయులు వెంకటేష్ కిషోర్,గోవింద్, శైలజ,రేణుక, కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని గిరిజనుల వినతి



**టీ మీడియా, సెప్టెంబర్ 23, మహానంది:**
మహానంది సమీపంలోని చెంచులక్ష్మి గూడెంలో ఉన్న గిరిజనలు తమ సమస్యలు పరిష్కరించాలంటూ, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాకు వినతి పత్రాన్ని అందజేశారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 30 మంది గిరిజనులు వారి సమస్యల్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పొలాలకు విద్యుత్ కోసం స్తంభాలను ఏర్పాటు చేస్తుండగా, అటవీ శాఖ రేంజర్ అడ్డగిస్తున్నారని తెలిపారు. కేవలం రెండు స్తంభాలు మాత్రమే, అటవీ ప్రాంతంలో పడుతున్నాయని, మిగతా స్తంభాలన్ని పొలాల్లోనే వస్తున్న అటవీ శాఖ అధికారులు అడ్డగించడంతో, పంట పొలాలు ఎండిపోతున్నాయని,అలాగే గూడెంలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కలెక్టర్ రాజకుమారి గణియా సానుకూలంగా స్పందించి, మీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని చెంచులక్ష్మి గూడెం అధ్యక్షుడు చలంచలం శ్రీనివాసులు పేర్కొన్నారు. వీరి వెంట నంద్యాల జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు లక్ష్మణ్,బహుజన సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు మంజుల సుబ్బారాయుడు, బీసీ సంక్షేమ సంఘం నారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# మరుగుదొడ్లు కడిగిస్తున్నారు

- ఆ గురుకులంలో ఉండలేము
- అయ్యావార్ల తీరుపై స్టూడెంట్స్ ఆగ్రహం
- ఫెన్సింగ్ దూకి కొండపైకి జంప్

**టీ మీడియా, సెప్టెంబర్ 23, యడ్లపాడు:(పల్నాడు ):**
టీచర్లు, ప్రిన్సిపాల్ వేధింపులు తాళలేక పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం వంకాయలపాడులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి 40 మంది పదో తరగతి విద్యార్థులు సోమవారం ఉదయం పారిపోయారు. మిగతా విద్యార్థులు సోలార్ ఫెన్సింగ్ గోడ దూకి పారిపోయే ప్రయత్నం చేయగా సిబ్బంది పట్టుకున్నారు. ఈ సమాచారంతో పోలీసులు, సంక్షేమ శాఖ అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. పదో తరగతి చదువుతున్న 67 మంది విద్యార్థులందరూ సోమవారం ఉదయం సోలార్ ఫెన్సింగ్తో ఉన్న గోడను దూకి పారిపోయే ప్రయత్నం చేశారు.

**రంగంలోకి పోలీసులు..**
దీనిని గమనించిన సిబ్బంది వెంటనే 27 మందిని పట్టుకున్నారు. మరో 40 మంది పాఠశాల ప్రహరీ గోడ దూకి సమీపంలోని కొండవీడు కొండలపైకి వెళ్లారు. విద్యార్థులు ఎటు వెళ్లారనే



విషయంపై ఉపాధ్యాయులు చుట్టుపక్కల ఆరా తీయగా విషయం తెలిసింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఉపాధ్యాయుల సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బానాయుడు, యడ్లపాడు ఎస్సై బాలకృష్ణ పోలీసులతో కలిసి కొండల వద్దకు వెళ్లి విద్యార్థులను తీసుకుని వచ్చారు. ఘటన స్థలికి నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు హాస్టల్ వద్దకు చేరుకున్నారు. విద్యార్థులను విచారించారు. అసలు కొండపైకి ఎందుకెళ్లారంటూ పోలీసులు ప్రశ్నించారు. దీంతో విద్యార్థులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ హనుమంతరావు తరుచూ వేధిస్తున్నాడని చిన్న చిన్న విషయాలకే తమను కొడుతున్నాడని విద్యార్థులు చిలకలూరిపేట రూరల్ సిఐ సుబ్బా నాయుడుకి చెప్పారు. ప్రిన్సిపాల్ వేధింపులు తాళలేకే ఇక్కడికి పారిపోయి వచ్చామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్య తెలుసుకున్న పోలీసులు వెంటనే వారందరిని బుజ్జగించి కొండ దించారు.

**స్టూడెంట్స్ బాధలివి**
వసతి గృహంలో సౌకర్యాలు సరిగా లేవని, అన్నం బాగోలేదు. ఆటలు ఆడించటం లేదు. మరుగుదొడ్లు కడిగిస్తున్నారు. అని విద్యార్థులు ఆరోపించారు. ప్రతి రోజూ స్లిప్ టెస్టులు పెడుతున్నారు. అన్ని సబ్జెక్టులు ఒకేసారి పెడుతుండటంతో రాయలేకపోతున్నామని తెలిపారు. దీంతో డీఎస్పీ నాగేశ్వరరావు వార్డెన్, ఉపాధ్యాయులను పిలిచి మాట్లాడారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తల్లిదండ్రులు కంగారు పడతారని, కాబట్టి ఈ విధంగా ఎప్పుడూ చేయొద్దని విద్యార్థులకు సూచించారు. ఏదైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని, అప్పుడప్పుడూ తాను వస్తానని పోలీసులు తెలిపారు. అమ్మానాన్న వచ్చినప్పుడు ఏదైనా సమస్య చెబితే, ఎందుకు మీరు చెప్పారు అని ఇబ్బందులు పెడుతున్నారని విద్యార్థులు తెలిపారు. విద్యార్థులు బయటకు వెళ్తే గోడ దూకి వెళ్తున్నారని, అప్పుడు అలా వెళ్లొద్దని ఉపాధ్యాయులు తిడుతున్నారని అన్నారు. అదే విధంగా కొంతమంది టీచర్లు తినకూడని పదార్థాలు తింటున్నారని విద్యార్థులు చెప్పారు. చివరికి క్రాప్ చేయించుకుంటే కటింగ్ చార్జీలు వసూలు చేస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు.

## లేబర్ కోడులకు నిరసనగాసిఐటియు బ్లాక్ డే

**టీ మీడియా ,సెప్టెంబర్ 23,రైల్వే కోడూరు:**




కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేక చట్టాలు చేసినందుకు, సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో సోమవారం టోల్గేట్ గాంధీ విగ్రహం వద్ద బ్లాక్ డే నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ . చంద్రశేఖర్, మాట్లాడుతూ కార్మికులు పోరాడు సాధించుకున్న,39 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడులుగా, కార్మిక వ్యతిరేక చట్టాలను 2019 సంవత్సరంలో పార్లమెంట్లో ఆమోదించుకున్నారని, కేంద్రంలో మోడీ మూడోసారి మెజార్టీ లేకుండా ఈ లేబర్ కోడులు అమలు చేయించడానికి ప్రయత్నించడానికి నిరసనగానే ఈ బ్లాక్ డే జరుగుతుంది అని తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా 8 గంటల పనిని 12 గంటలకు పెంచడం, కనీస వేతనాలు చట్టం, ఓవర్ టైం, పీఎఫ్, బోనస్సు, గ్రాడ్యుటి, ప్రభుత్వ ,ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న కార్మిక వర్గానికి వ్యతిరేకంగా, చట్టాలను నిర్వీర్యం చేసి పెట్టుబడుదారులకు అనుకూలంగా మార్చారన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ ఆపాలని, కడప ఉక్కును ప్రారంభించాలని, విభజన చట్టం హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలన్నారు,లేబర్ కోడ్ చట్టాలు అమలు చేస్తే కార్మికుల హక్కులు కోల్పోతారని, ఎన్ డి ఏ భాగస్వాములైన, టిడిపి, జనసేన, పార్టీలు, కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని, పాత చట్టాలు అమల వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, సిఐటియు ఉపాధ్యక్షులు, లింగాల యానాదయ్య, సహాయ కార్యదర్శి, ఈవో ఏ, మండల కన్వీనర్ నగిరిపాటి ఆనందు, కోశాధికారి, కర్రతోటి హరి నారాయణ, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, యూనియన్, నాయకులు, సి వేణు, ఎం సుబ్బరాయుడు, అంకయ్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు, మద్దెల ప్రసాద్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కన్వీనర్, బండారు రాజశేఖర్, కేశవులు వీఆర్ఏ సంఘం, మండల కార్యదర్శి లక్ష్మీకర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఓబులవారిపల్లి మండల కన్వీనర్,సి. హరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



## ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

**టీ మీడియా ,సెప్టెంబర్ 23,ఎండపల్లి :**
మండలం రాజారాం పల్లి తాజా మాజీ సర్పంచ్ గెల్లు శేఖర్ ధర్మపురి నియోజకవర్గం ధర్మారం మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్లా నాయక్ ను సోమవారం గెల్లు చంద్రశేఖర్ తన స్వగృహానికి ఆహ్వానించి,నూతనంగా చైర్మెన్ గా ఎన్నికైన రూప్ల నాయక్ కు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బంద్ర గంగాధర్, అమ్ముల నరేష్, పన్నాల ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.



## వివేకానంద యూత్ ఆధ్వర్యంలో దీపారాధన

**టీ మీడియా ,సెప్టెంబర్ 23,ఎండపల్లి:**
మండల కేంద్రంలోని వివేకానంద యూత్ ఆధ్వర్యంలో దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డు నాణ్యత కల్తీకి నిరసనగా టిటిడి దేవస్థానం సూచన మేరకు సోమవారం సాయంత్రం దీపారాధన చేస్తూ క్షమామంత్రం చదవడం జరిగిందన్నారు .ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీకి పాల్పడినవారిని శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు నగేష్,రాజేందర్,ప్రశాంత్, తిరుపతి, రవి, తునికి రవి, స్వామి, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్.. దళిత వ్యతిరేక పార్టీ

(మొదటిపేజీ తరువాయి...)

విమర్శించారు. దళిత నేతల్ని అగౌరవపరిచిన కాంగ్రెస్ పార్టీ%ూ% దళిత వ్యతిరేక పార్టీ అని అమిత్ షా అభివర్ణించారు.
రాహుల్ గాంధీ ఇటీవల అమెరికాలో అభివృద్ధి జరిగిన తర్వాత రిజర్వేషన్లు అవసరం లేదు. వాటిని తొలగిస్తాం అని అన్నారు. రిజర్వేషన్లకు వ్యతిరేకమని ఆయన మాటలే చెబుతున్నాయి. కేవలం మోడీజీ మాత్రమే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చెందిన రిజర్వేషన్లను కాపాడగలరని అమిత్ షా చెప్పుకొచ్చారు.
జమ్మూ కాశ్మీర్ ఎన్నికల సందర్భంగా రాహుల్ గాంధీతోపాటు నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి)లు ఆర్టికల్ 370ని వెనక్కి తీసుకొస్తామని, ఉగ్రవాదులందరినీ విడుదల చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా రాహుల్‌కి నేను చెప్పదలచుకున్నది ఒక్కటే.. 'రాహుల్ బాబా మీకే కాదు.. మీ మూడోతరం వచ్చినా ఆర్టికల్ 370 తిరిగి రాదని చెప్పాలనుకుంటున్నాను. ఆర్టికల్ 370 ఇప్పుడు చరిత్రగా మారింది. మీ తాత కాలంలో ఆర్టికల్ 370 అనేది ఓ పెద్ద క్వశ్చన్ మార్క్‌గా ఉంది. ఆ క్వశ్చన్‌మార్క్‌ను నరేంద్ర మోడీ తొలగించేశారు. అదిక తిరిగిరాదు' అని షా వ్యాఖ్యానించారు.
హర్యానా ఎన్నికలకు సంబంధించి మాట్లాడుతూ.. 'బిజెపి పాలన ఎలా ఉంటుందో చెప్పడానికి ఉదాహరణగా హర్యానానే నిలుస్తుంది. గతంలో హర్యానాలో రెండు వేర్వేరు పార్టీలు అధికారంలోకి వస్తూ పోతుండేవి. ఒక పార్టీ అధికారంలోకి రాగానే..అవినీతి పెరిగిపోయింది. మరో పార్టీ అధికారంలోకి రాగానే గూండాయిజం పెరిగింది. రెండు పార్టీల్లోనూ ఆశ్రిత పక్షపాతం, కులతత్వం తారాస్థాయికి చేరుకున్నాయి. ఇలాంటి సమయంలోనే హర్యానాలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రాకముందు ఉద్యోగం పొందాలంటే కచ్చితంగా ముడుపులు ముట్టజెప్పాల్సిందే. కానీ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి డబ్బును ఆశించకుండా పారదర్శకతతో వేలాదిమంది యువకులను రిక్రూట్ చేసుకుందని అమిత్ షా చెప్పుకొచ్చారు. అగ్నివీర్ పథకం విషయంలో రాహుల్‌గాంధీ యువతను తప్పుదారి పటిస్తున్నారని షా విమర్శించారు.



## ఎల్ఎండీలోకి దూకి వివాహిత ఆత్మహత్యాయత్నం

**టీ మీడియా ,సెప్టెంబర్ 23,కరీంనగర్:**
ఏం కష్టం వచ్చిందో ఓ వివాహిత నిండు కుండలా పారుతున్న నదిలో దూకి ఆత్మహత్యా యత్నం చేసింది. మెరుపు వేగంతో స్పందించిన స్థానికులు ఆమెను కాపాడటంతో ప్రాణాలతో బయటపడింది. ఈ సంఘటన కరీంనగర్‌లో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..కరీంనగర్ ఎల్ఎండీలో టూరిస్ట్ బోటులో పర్యాటకులతోపాటు సంధ్య అనే వివాహిత కూడా టికెట్ కొనుక్కుని బోటు ఎక్కి కూర్చుంది. అయితే బోట్ స్పీడ్ పెంచగానే వెనక్కి వెళ్లి నీటిలో అమాంతం దూకేసింది. వెంటనే గమనించిన బోట్ డ్రైవర్, బోటులో ప్రయాణిస్తున్న మరికొందరు బోటును నీళ్లపై ఆపేసి ఆమెను రక్షించేందుకు ప్రయత్నించారు. సేఫ్టీ ప్యాడ్స్ నీళ్లలో వదిలి ఆమెను క్షేమంగా బోటులోకి లాగి రక్షించారు. అనంతరం లేక్ పోలీసులకు సమాచారమిచ్చి సదరు మహిళను ప్రభుత్వ హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా సంధ్య ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.



## భూ నిర్వాసితుల పరిహారం విషయంలో చర్చకు సిద్ధం

- మాజీ ఎంపీటీసీ తిరుపతి గౌడ్

**టీ మీడియా సెప్టెంబర్ 23: వెల్గటూర్:**
భీఆర్ ఎస్ ప్రభుత్వంలో ఏనాడు కమిషన్ లు లేనిదే ఏ పని చేయని బిఆర్ఎస్ నాయకులు ప్రజా శ్రేయస్సు కోసం అను నిత్యం పాటుపడుతూ, చెగ్యాం భూ నిర్వాసితులకు నష్టపరిహారం అలుపెరుగని కృషి చేసి ఇచ్చిన మాట ప్రకారం నిర్వాసితులందరికీ చెక్కులు పంపిణీ చేసిన ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పై ఆరోపణలు చేస్తున్నారని, కొందరు బిఆర్ఎస్ నాయకులు ఆదివారం వెల్గటూర్ మండల కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించి స్థాయికి మించిన విమర్శలు చేయడం, వారి అవివేకానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, చెగ్యాం తాజా మాజీ ఎంపీటీసీ రంగు తిరుపతి గౌడ్ అన్నారు. మీ ప్రభుత్వ హయాంలో గత పది సంవత్సరాలు జీవోల జారీకే సరిపోయింది. కానీ నష్ట పరిహారం ఎందుకు రాలేదని ప్రశ్నించారు. పైగా దయ్యాలు వేదాలు వల్లించినట్లు బహిరంగకు చర్చకు సిద్ధమా.. అని సిగ్గుమాలిన సవాల్ విసరడం విడ్డూరంగా ఉందన్నారు. మీ సవాల్ ను స్వీకరిస్తున్నామని, బహిరంగ చర్చకు మేం సిద్ధమని అన్నారు. సోమవారం వెల్గటూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రంగు తిరుపతి గౌడ్ మాట్లాడుతూ బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయాంలో 18 కోట్ల రూపాయల జీవోను జారీ చేసి పది సంవత్సరాలు గడిచిన చెగ్యాం ముంపు గ్రామానికి నిధులు ఎందుకు విడుదల చేయలేదని , అసలు ముంపు గ్రామానికి రావాల్సిన 25 కోట్ల నష్ట పరిహారంను 18 కోట్ల కు తగ్గించి, ఎందుకు జీవోను విడుదల చేశారని ప్రశ్నించారు. మీరు ఇవ్వలేని 18 కోట్ల రూపాయలను మా ప్రభుత్వ హయాంలో భూ నిర్వాసిత బాధితులకు అందజేసినందుకు, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసును ముట్టడిస్తారా అని అన్నారు. పది సంవత్సరాల నుండి విడుదల కానీ పరిహారం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినాక ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవతో నిధులు విడుదల చేశారని, గ్రామ ప్రజలంతా హర్షద్వానాలు వ్యక్తం చేయడంతో, టిఆర్ఎస్ పార్టీ నాయకులు సిగ్గుతో తల దించుకొని ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడుతున్నారని రంగు తిరుపతి గౌడ్ అన్నారు. బి.ఆర్.ఎస్ నాయకులు కేవలం రాజకీయ సౌలభ్యం కోసమే పది సంవత్సరాలు ముంపు గ్రామ బాధితులకు నష్టపరిహారం రాకుండా ఆపారని, గ్రామంలోని 126 కుటుంబాల వద్ద 20 వేల నుండి 40 వేల రూపాయల వరకు లంచాలు వసూలు చేశారని కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు నందయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గుండాటి జితేందర్ రెడ్డి లతోపాటు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, డైరెక్టర్లు,మాజీ సర్పంచులు,మండల కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## వరద బాధితులకు సూపర్ స్టార్ మహేశ్ విరాళం

- సీఎంను కలిసి రు.50లక్షల చెక్కు

**టి మీడియా,హైదరాబాద్:**
బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా కురిసిన భారీ వర్షాలకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు తీవ్రంగా నష్టపోయిన సంగతి తెలిసిందే. అయితే వారిని ఆదుకునేందుకు సినీ హీరో, సూపర్ స్టార్ మహేశ్ బాబు ముందుకు వచ్చారు. ఇప్పటికే ఆయన ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెరో రూ.50లక్షల చొప్పున ప్రకటించారు. ఈ మేరకు ఇవాళ(సోమవారం) తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కలిసి దానికి సంబంధించిన రూ.50లక్షల చెక్కును అందజేశారు. అలాగే ఏఎంబీ మాల్ తరఫున మరో రూ.10లక్షలు అందజేశారు. దీంతో ఆయన తెలంగాణకు మొత్తంగా రూ.60లక్షలు ఇచ్చినట్లు అయ్యింది. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి మహేశ్ చెక్కు అందజేశారు. మహేశ్ బాబుతోపాటు ఆయన సతీమణి నమ్రత శిరోద్కర్ కూడా ఉన్నారు. వారిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించిన సీఎం ఇద్దరినీ శాలువాతో సన్మానించారు.


### మహేశ్ లుక్ వైరల్..

అయితే చెప్పిన దాని కన్నా అదనంగా మరో రూ.10లక్షలు ఇవ్వడంపై ఆయన ఫ్యాన్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహేశ్ బాబు తన మంచి మనస్సును మరోసారి చాటుకున్నారని సోషల్ మీడియా వేదికగా కామెంట్లు పెడుతున్నారు. ఇప్పటికే ఆయన చాలా మంది పిల్లలకు గుండె ఆపరేషన్లు సహా పలువురిని ఆదుకున్నారని గుర్తు చేసుకుంటున్నారు. తమ అభిమాన నటుడికి మంచి మనసు ఉందంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మహేశ్ బాబు కొత్త లుక్ వైరల్ అవుతోంది. డైరెక్టర్ రాజమౌళితో మహేశ్ చేస్తున్న " సినిమా కోసం సూపర్ స్టార్ నయా లుక్‌లో కనిపించారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో ఈసారి భారీ విజయం ఖాయమంటూ ఫ్యాన్ సంబరపడిపోతున్నారు.

# ప్రైవేట్ ఆస్పత్రి పైశాచికత్వం..

- ఫీజు ఇవ్వలేదని వేసిన కుట్లు తొలగింపు

**టీ మీడియా ,సెప్టెంబర్ 23,కామారెడ్డి:**
ప్రాణాలతో పోరాడుతూ చికిత్స కోసం వచ్చే అభాగ్యులను జలగల్లా పీడించే ప్రైవేట్ ఆస్పత్రులు మన చుట్టూ చాలానే ఉన్నాయి. రోగి మృతి చెందినా పూర్తి ఫీజు చెల్లిస్తే గానీ మృతదేహాలను అప్పగించని ఆస్పత్రులు కూడా ఉన్నాయి. తాజాగా ఫీజుల కోసం ఓ ప్రైవేట్ దవాఖానా సిబ్బంది ఎంతకు తెగించిందో మీరే తెలుసుకోండి. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడికి కుట్లు వేసినందుకు ఫీజు చెల్లించమని ఆస్పత్రి సిబ్బంది కోరారు. అయితే తన వద్ద అంత డబ్బు లేదని చెప్పినందుకు ఆగ్రహించిన ఆస్పత్రి యాజమన్యం.. యువకుడికి వేసిన కుట్లను తొలగించింది. ఈ దారుణ ఘటన కామారెడ్డి కేంద్రంలో ఆదివారం చోటుచేసుంది. వివరాల్లోకెళ్తే..కామారెడ్డి పట్టణానికి చెందిన శ్రీను అనే యువకుడు బైక్ వెళ్తుండగా.. అదుపుతప్పి కిందపడి గాయాలపాలయ్యాడు. రక్తస్రావం కావడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ దవాఖానకు వెళ్లాడు. డాక్టర్ కన్సల్టేషన్ ఫీజు రూ. 300 చెల్లించి చూపించుకున్నాడు. ప్రమాదంలో తగిలిన గాయాలకు దవాఖాన



సిబ్బంది కుట్లు వేసి, కట్లు కట్టారు. కుట్ల వేసినందునందుకు మళ్లీ డబ్బులు అడిగారు. తన వద్ద నగదు లేకపోవడంతో క్రెడిట్ కార్డు ద్వారా ఫీజు తీసుకోవాలని చెప్పాడు. అయితే అందుకు దవాఖాన సిబ్బంది నిరాకరించారు. డబ్బు చెల్లించలేదని ఆస్పత్రి సిబ్బంది యువకుడితోపాటు, అతడి వెంట ఉన్న స్నేహితులపై కూడా దాడికి పాల్పడ్డారు. ఫీజు చెల్లించలేదనీ యువకుడికి వేసిన కుట్లను తొలగించి తమ పైశాచికత్వాన్ని చాటుకున్నారు. పూర్తిగా వేసిన కుట్లు తొలగించడంతో.. బాధిత యువకుడిని అతని స్నేహితులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. దీంతో యువకుడి బంధువులు దవాఖాన వద్ద ఆందోళనకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

### మరో ఘటన: నవజాత శిశువు విక్రయించేందుకు యత్నం.. 9 మంది అరెస్ట్

హైదరాబాద్‌లోని చంద్రాయణగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో ఓ దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికంగా ఉంటున్న షేక్ ఇస్మాయిల్, సుల్తానా బేగం దంపతులకు ఇటీవల ఓ మగ శిశువు జన్మించాడు. ఈ శిశుకు వీరికి నాలుగో సంతానం. దీంతో 15 రోజుల చిన్నారిని అమ్మకానికి పెట్టారు. అందుకు మెహది అనే వ్యక్తిని సంప్రదించారు. అతడు ఫాతిమా రహ్మత్ అనే మరో వ్యక్తికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. దీంతో వారంతా కలిసి చిన్నారి విక్రయించేందుకు చంద్రాయణగుట్టలో కలుసుకున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు శిశువు తల్లిదండ్రులతో సహా తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు.



## తిరుమల లడ్డూ కల్తీపై కేంద్రం సీరియస్..


- ఏఆర్ డెయిరీకి నోటీసులు

**టీ మీడియా ,సెప్టెంబర్ 23,న్యూఢిల్లీ :**
వరల్డ్ ఫేమస్ శ్రీవారి లడ్డూ.. ఇప్పుడు మోస్ట్ బర్నింగ్ టాపిక్‌గా మారింది. దేశవ్యాప్తంగా తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. పరమ పవిత్రమైన లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు వాడారంటూ పెద్దఎత్తున నిరసనలు మిన్నంటాయి. ఈ లడ్డూ వివాదం సుప్రీంకోర్టును కూడా తాకింది. గత పాలకుల వైఫల్యమేనంటూ ఏపీ ప్రభుత్వం కన్నెర్ర చేస్తూనే ఉంది. సీఎం చంద్రబాబు సైతం ఆగ్రహావేశాలు వెళ్లగక్కారు. పామాయిల్ కూడా రాని రేటుకు నెయ్యి ఎలా వచ్చిందంటూ మండిపడ్డారు.లడ్డూ తయారీపై ఏపీ ప్రభుత్వ విమర్శలు, దేశవ్యాప్త ఆందోళనలతో కేంద్ర ప్రభుత్వం అలర్ట్ అయ్యింది. కల్తీ నెయ్యి సరఫరా చేసిన కంపెనీలపై సీరియస్ అయ్యింది. ఇక కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి దిగిన %ూ% టీటీడీకి నెయ్యి సరఫరా చేసిన తమిళనాడుకు చెందిన ఏఆర్ డెయిరీకి నోటీసులిచ్చి వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది.ఇటు ఏఆర్ డెయిరీ మాత్రం.. ఎలాంటి కల్తీకి పాల్పడలేదంటోంది. మంచి నెయ్యినే పంపించామని.. క్వాలిటీ చెక్ చేశాకే కంపెనీ నుంచి నెయ్యి వెళ్లిందంటోంది. ఎలాంటి న్యాయ విచారణకైనా సిద్ధమంటూ ఇప్పటికే స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఏఆర్ డెయిరీకి నోటీసులివ్వడం చర్చనీయాంశమైంది. మరి చూడాలి నెయ్యి కల్తీపై ఎలాంటి రిపోర్ట్ వస్తుందో.!

## శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా శాంతి హోమం

### సర్వ దోషాల నివారణకు : టీటీడీ ఈవో జె. శ్యామలరావు

**టీ మీడియా ,సెప్టెంబర్ 23,తిరుమల :**
లడ్డూ ప్రసాదాలు, ఇతర నైవేద్యాల పవిత్రత, దైవత్వాన్ని పునరుద్ధరింపజేసేందుకు సోమవారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయంలోని బంగారు బావి చెంతగల యాగశాలలో వైఖానస ఆగమోక్తంగా శుద్ధి, శాంతి హోమాలను టీటీడీ నిర్వహించింది. శాంతి హోమం ముగిసిన అనంతరం ఆలయం వెలుపల టీటీడీ ఈవో జె శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి మీడియాతో మాట్లాడుతూ, శ్రీవారి ఆలయంలో ఉదయం 6 నుండి 10 గంటల వరకు రుత్వికులు వాస్తు శుద్ధి, కుంభజాల సంప్రోక్షణ నిర్వహించారన్నారు.ఈ శాంతి హోమం ద్వారా భక్తులు లడ్డూ ప్రసాదం , నైవేద్యం నాణ్యతపై తమకున్న భయాలను మరియు అపోహలను పక్కన పెట్టవచ్చు అన్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు మాట్లాడుతూ, యాగశాలలో సంకల్పం, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, వాస్తు



హోమం, కుంభప్రతిష్ట, పంచగవ్య ఆరాధన తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.పూర్ణాహుతి అనంతరం కుంభ ప్రోక్షణ నిర్వహించి విశేష నైవేద్యం కూడా సమర్పించినట్లు చెప్పారు. ఇక నుంచి లడ్డూ ప్రసాదాలు, నైవేద్యాలకు ఎలాంటి దోషాలు ఉండవని, భక్తులు సంతోషంగా స్వీకరించవచ్చని తెలిపారు.సాయంత్రం 6 గంటలకు శ్రీవారి భక్తులు తమ ఇంటిలో దీపారాధన చేసే సమయంలో, క్షమా మంత్రాలైన%ూ%. "ఓం నమో నారాయణాయ, ఓం నమో భగవతే వాసుదేవాయ, ఓం నమో వేంకటేశాయ" లను పఠించి శ్రీవారి అనుగ్రహం పొందగలరన్నారు. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ప్రధానార్చకులు గోవిందరాజ దీక్షితులు, కృష్ణశేషాచల దీక్షితులు, ఆగమ సలహాదారు రామకృష్ణ దీక్షితులు, సీతారామ దీక్షితులు, వేదపారాయణదారులు, రుత్వికులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.